# నాన్న

ఒక్కసారి ఉలిక్కిపడి నిద్రలేచాను. ఏవో పీడకలలు... ఉదయం లేచినదగ్గర్నుంచీ మనసంతా కలతగా ఉంది. అసలు రాత్రంతా ఏవో ఆలోచనలు... కలతనిద్రలో ఎన్నెన్నో జ్ఞాపకాలు.

నిన్నట్నుంచీ పదేపదే నాన్న జ్ఞాపకం వస్తూనేఉన్నాడు. ఇప్పుడు నాన్న ఎట్లా ఉన్నాడో - మనస్సుమూలలో ఏదోబాధ కలుక్కుమంటోంది 'అంత ప్రేమగా చూసుకునే నాన్నను వదలి నేనెందుకు పారిపోయి వచ్చాను?' — ఇల్లువదిలిన ఈ పదేళ్ళలో చాలాసార్లు ప్రశ్నించుకున్నాను. ఇంటికి వెళదామని ఎన్ని వందలసార్లో అనుకున్నాను. కానీ ముఖంచెల్లలేదు. అవును, ఇంటికి పెద్దకొడుకుగా నాన్నకు నేను మానసికంగానైనా ఏం సుఖశాంతుల్నిచ్చాను?

గతం నీడలువదలకుండా మనసును వేధిస్తూనే ఉన్నై.

నాన్న బడిపంతులు. నిజాయితీకి, మంచితనానికి మారుపేరు - మంచి టీచరుగా కూడా గుర్తింపు ఉంది.

తనకు చదువుచెప్పాలని నాన్న ఎంతగానో ప్రయత్నించారు.

బడి ఎగ్గొట్టి గోలీలు ఆడుతున్నట్లు తెలిసి మందలించారు - బుజ్జగించారు. ఉహుఁ చదువంటే ఇష్టంలేదు తనకి - అదొక నిర్బంధంగా ఉండేది.

వేరే స్కూలయితే ఎగ్గొడుతున్నానని తను పనిచేసే బళ్ళో చేర్పించాడు నాన్న.

అసలప్పుడే కథ మలుపు తిరిగింది. తను నాన్న బళ్ళో చేరనన్నాడు.

ఆయన కళ్ళనీళ్ళు పెట్టుకుని, "చదువు లేనివాళ్ళకి విలువలేదురా- నువ్వు డాక్టరువో, ఇంజినీరువో కావాలన్న పేరాశ నాకులేదు- అంత బరువు కూడా నేను మోయలేను - కనీసపు డిగ్రీ అయినా ఉండాలి కదా" అన్నాడు.

ఆ ఆవేదన ఆనాడు నేనెందుకు అర్థంచేసుకోలేక పోయాను?- ఒక్కసారి..ఒక్కసారి పదేళ్ళు వెనక్కి జరిగిఆరోజొస్తే ఎంతబాగుంటుంది?

"నాకు చదువంటే ఇష్టంలేదు" చాలా పొగరుగా జవాబు చెప్పాను.

"జీవితంలో మనిషిగా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడానికి చదువు చాలా అవసరం బాబూ! చదువుకోకుండా ఏం చేస్తావు చెప్పు"- ఆ మాటల వెనక ఎంత ఆవేదన ఉన్నదో!

"నీకేం పన్లేదు. ఎప్పుడూ చదువు-చదవని ప్రాణాలు తింటావ్. ఈసారి చదువు మాట ఎత్తితే ఇంటికే రాను..." బెదిరించి బయటికి పరుగుతీశాను. నాలాంటి మరో నలుగురైదుగురితో కలిసి రోడ్లు పట్టుకుని తిరగడం- సరదాగా ముక్కలాడడం- అట్లా గడిచిపోయేవి రోజులు.

సాధారణంగా నాన్నకి కోపం రానేరాదు. తనంటే ఎంత ప్రేమ..., యేమిటి నోటికి ఉప్పగా తగుల్తోంది- ఓహ్, కన్నీరు...తనెందుకు యేడుస్తున్నాడు?... నాన్న ప్రేమ... అవును ఒక్కసారి నాన్న దగ్గరికెళ్ళి చిన్నవాడ్నై 'నాన్నా; ఇంకెప్పుడూ నిన్ను బాధపెట్టను. నీతోనే ఉండి పోతాను - అని చెప్పగలిగితే- తను ఆఫీసరవుతే...? ప్చ్ .. లాభంలేదు.

యేదైనా పనిమీద నాన్న బయటికి వెళ్ళి ఆలస్యంగా ఇంటికి వచ్చినపుడు తను నిద్రపోతుంటే లేపేవాడు. 'నాన్నా రాజా! నీకోసం స్వీట్ తెచ్చాను. తీసుకోమ్మా - తిని పడుకో" ఆ రాత్రి అది తినిపిస్తేగానీ ఆయనకు తృప్తిగా ఉండేది కాదు. తిన్నాక మంచినీళ్ళు తాగించి సరిగ్గా పడుకోబెట్టి దుప్పటి కప్పేవాడు. ఆ ప్రేమ విలువ నేను గుర్తించానా?

ఎట్లాగో తొమ్మిదోక్లాసుకొచ్చాను. వార్షికపరీక్షలు - బలవంతాన నాన్న ఏవో ఒకటి రెండు పాఠాలు చెప్తుంటే ఆవులిస్తూ విన్నాను.

తెల్లారి లెక్కలపరీక్ష. ఆ లెక్కలెందుకో నాకసలు బుర్రకెక్కవు. ఆ పరీక్షకు నేను వెళ్ళలేదు.

రాత్రి 11గం॥లకు ఇల్లుచేరాను. నాన్న ఏమంటాడో అని భయంగానే ఉంది. నాన్న నాకోసం కాచుకొని ఉన్నాడు నిద్రపోకుండా.

నేను అన్నంతిని వచ్చిందాకా యేం మాట్లాడలేదు. అట్లా గమనిస్తుండిపోయాడు. పడుకోడానికి వెళ్ళబోతుంటే అప్పుడు పిల్చాడు.

"లెక్కలపరీక్ష ఎందుకు వ్రాయలేదు?"

"నాకు లెక్కలు రావు" తలబిరుసుగా జవాబిచ్చాను.

"రాకపోతే నేర్చుకోవాలి" మృదువుగా అన్నాడు.

"నాకసలు చదువుకోవడమే ఇష్టంలేదు."

"దౌర్భాగ్యుడా! ఈసారి చదువిష్టంలేదన్నమాటంటే చంపేస్తాను," నాన్నలో సహనం కరిగిపోతోంది.

"ఈసారి నువ్వు చదువుమాట ఎత్తితే నీ ఇంట్లో ఒక్క క్షణం ఉండను" అంతకంటే పై స్థాయిలో అన్నాను.

నాన్న సహనం కరిగిపోయింది, "పండితపుత్ర అన్నమాట నిజం చేశావురా - నువ్వు చదువుకొని వృద్ధిలోకి వస్తావని ఆశపడ్డాను. కానీ ఇట్లా అవుతావనుకోలేదు - నిన్నిట్లా చూసేకంటే కంటిముందు లేకపోవడమే మనశ్శాంతి...." నాన్న గొంతు గద్గదంగా పలికింది. మరుక్షణం ఆ స్వరంలో తీక్షత— "పోరా పో... ఉండి ఉద్ధరించేదేముంది?"- అన్నారు. చివరిమాట ముల్లులా గుచ్చుకుంది. రోషంగా బయటికి రెండడుగులు వేశాను.

వెనుక నుంచి నాన్న స్వరంలో ఆరాటం ధ్వనించింది- "ఎక్కడికిరా?"

"నా ఇష్టమొచ్చిన చోటికి" తల ఎగరేశాను.

"చాల్లే! వచ్చి పడుకో"-నాన్న ప్రేమగా కసరడం పదేళ్ళ క్రిందటైనా స్పష్టంగా గుర్తుంది.

"నే నింక రాను"- వెనికనుంచి నాన్న పిలుపు నేను వినిపించుకోలేదు.

గమ్యంలేని నడక- ఈ పదేళ్ళ గమ్యంలేని నడకే- ఎక్కడా స్థిరత్వంలేదు. చదువుకోనందుకు కుమిలిపోని క్షణంలేదు. కడుపునిండక కాళ్ళు కడుపులో పెట్టుకున్ననాడు నాన్న మాటలే- కూలీ దొరకక ఊరూరా తిరిగినప్పుడూ నాన్న మాటలే. అదృష్టముండి యే పెళ్ళిలోనో ఒకరోజెప్పుడైనా ఒక స్వీటు దానం దొరికిననాడూ నాన్న తలపులే. నాన్న మరపుకు రాలేదు- ఆ ఆప్యాయత, ప్రేమ ఆయన విలువ, చదువువిలువ. జీవితంలో ఒక్కొక్క అనుభవంతో బాగా తెలిసొచ్చింది. పేపర్ బాయ్‌గా స్టేషన్లో కూలీగా- ఎన్నో అవతారాలు.

ఉద్యోగం చేసేవాళ్ళను చూస్తూంటే నాన్న నా కోసం ఎందుకింత ఆవేదన పడేవాడో అర్ధమయ్యేది.

దీనికితోడు విధి నాతో మరోసారి చెలగాటమాడింది. అన్నాళ్ళూ యే కూలీ నాలీతోనో భుక్తి గడిచేది. కానీ రోడ్డు పక్క ఫుట్‌పాత్ మీద పడుకున్న నేను హఠాత్తుగా మేల్కొన్నానొకరోజు. అర్ధరాత్రి- తప్ప తాగిన లారీ డ్రైవరొకడు లారీ ఫుట్‌పాత్ మీదకి ఎక్కించాడు. ఇద్దరి ప్రాణాలుపోగా నా కుడిచెయ్యి విరిగిపోయింది...

ఆరోజు నాన్నను తలుచుకుని కుళ్ళికుళ్ళి యేడ్చాను, అప్పట్నుంచి ఊళ్ళో వాళ్ళ దయా ధర్మాలమీద ఆధారపడటం తప్పనిసరైంది. అసలు బ్రతికేదెందుకో కూడా అర్ధంకాకుండా.

మోకాళ్ళ మధ్య తలపెట్టుకుని ఎంతసేపు యేడుస్తూ కూర్చున్నానో- చనిపోయే లోపల నాన్నని ఒక్కసారి చుడాలన్న కోరిక తీవ్రతరమవుతోంది. ఒక్కసారి నాన్నను క్షమించమని అడగాలి నాన్న

స్పర్శలో సుఖం అనుభవించాలి. ఊరు వెళ్ళిరావాలి ఇన్నాళ్ళ అహం కరిగిపోయింది. చాలా గాఢంగా మనసులో ఈ కోరిక మెదలైంది.

రోశయ్య 'రాజా, రాజా' అని కుదుపుతుంటే ఎర్రబడిన కళ్ళతో 'యేమిటి' అన్నట్లు చూశాను - జ్ఞాపకాలు చెదిరిపోయినై.

"తొందరగా లేవాలి" - రోశయ్య నా చెయ్యి పట్టుకుని లేపాడు. వాడికళ్ళు ఆనందంతో వెలిగిపోతున్నై.

"సంగతేమిటి?" నిర్లిప్తంగా అడిగాను. 'హుర్రే'—అని ఆనందం సూచించే ఒక కేకవేసి "ఏమిటంటావేంటి? ఎవడో దిక్కులేని చావు చచ్చాడు. దాన్దగ్గర కూచుని రెండు బుడిబుడిరాగాలు తీశావంటే డబ్బులే డబ్బులు" సంబరంగా చెప్పాడు రోశయ్య.

అయిష్టంగా, నిరాసక్తంగా రోశయ్యతో ముందుకు నడిచాను. 'ఒకరి చావు ఒకరికి పండుగా?, మనస్సు చాలా ఆవేదనగా ఉంది. అడుగులు తడబడుతున్నై. యేదో అదృశ్యశక్తి నడిపిస్తున్నట్లుగా నడిచాను.

శవంమీద పూర్తిగా బట్టకప్పి ఉంది. రోడ్డుపక్కన అనాథలాగా పడిఉన్న ఆ శవాన్ని అప్పటికే ఆ రోడ్డునవెళ్ళేవాళ్ళు పరికించి చూస్తున్నారు. నేను శవాన్ని సమీపించాను. హఠాత్తుగా వీచినగాలికి శవం మొహంమీద బట్ట తొలగిపోయింది.

అంతే! మనస్సులో బండరాయి పెట్టినట్లయింది. ఎవరది?...నా... నాన్న... దిగ్భ్రాంతిగా చూశాను-అంతే, దుఃఖం కట్టలుతెంచుకుంది. ఏడుస్తూనే ఉన్నాను. ఎంతయేడ్చినా మనసులో వేదన తీరడంలేదు. రోశయ్య చుట్టూమూగినవాళ్ళతో యేదో చెపుతున్నాడు. చిల్లరడబ్బులు రాలుతున్నై.

'భలే ఏడుస్తున్నావ్' - అన్నట్లు మాపుడువేలు, బొటనవేలు కలిపి అభినయిస్తున్నాడు రోశయ్య. నేను మధ్యలో తలెత్తి చూసినపుడు.

కొందరు - ఇది నాటకమని తరలిపోతున్నారు. క్రమంగా జనం తప్పుకున్నారు. యేడ్చియేడ్చి సొమ్మసిల్లిపోయాను. మనసంతా శూన్యంగా ఎడారిలా ఐపోయింది.

"ఇంకా ఎంత సేపు ఆ శవాన్ని అంటిపెట్టుకునుంటావ్? మన పని ఐపోయింది. దీన్ని వదిలించుకోకపోతే లేనిపోని బెడద. అయినా ఆ దిక్కు లేనిశవాన్ని దగ్గర పెట్టుకుని యేదో మీ అయ్య చచ్చినట్లు నిజంగానే యేడుస్తావేం?" రోశయ్య నా వీపు తడుతూ అడిగాడు.

"చచ్చిపోయింది నిజంగా మా నాన్నే రోశయ్యా!" అతి కష్టంమీద పలికాను. నాకింకా కన్నీరు జారిపోతూనే ఉంది. కన్నీటిపొరలమధ్య దిగ్భ్రాంతితో నిలబడ్డ రోశయ్య ఒకపక్క, జీవరహితంగా పడిఉన్న నాన్న మరొకపక్క మసకమసగ్గా కనిపిస్తున్నారు....

(యువ జనవరి' 83)